ప్రజాశక్తి
శుక్రవారం 24 ఫిబ్రవరి 2023 5 అనంతపురం





సమావేశంలో మాట్లాడుతున్న బ్రూక్ స్వచ్ఛంద సంస్థ ప్రోగ్రామ్ లీడర్ ప్రియా పాండే

ధర్మవరం-గుత్తి రైల్వే పనులు పూర్తి

◆90 కిలోమీటర్లు డబుల్ లైన్ కనెక్టివిటీతో విద్యుదీకరణ ◆చిగిచెర్ల-ధర్మవరం మధ్య 11 కిలోమీటర్ల మేర పనులు



గుత్తి-ధర్మవరం ప్రాంతంలో పనులు పూర్తియిన డబుల్ రైల్వే లైన్



ప్రజాశక్తి-అనంతపురం

ఉమ్మడి జిల్లాలో రైల్వే శాఖ మరో ముఖ్యమైన ప్రాజెక్టును పూర్తి చేసింది. చిగిచెర్ల నుంచి ధర్మవరం మధ్య డబ్లింగ్, విద్యుదీకరణతో సహా పూర్తి చేసి, దక్షిణ మధ్య రైల్వే ప్రారంభించింది. దీని ఫలితంగా గుత్తి నుంచి ధర్మవరం వరకు మొత్తం 90 కిలోమీటర్ల మేర ఇప్పుడు డబుల్ రైల్వే లైన్ కనెక్టివిటీ విద్యుద్దీకరణతో అందుబాటులోకి వచ్చింది.

గుత్తి – ధర్మవరం డబ్లింగ్ ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రముఖమైన రైలు మార్గం. ఈ లైన్ రెండు తెలుగు రాష్ట్రాలను బెంగుళూరు, కర్ణాటక రాజధాని నగరం వెలుపల కలిపే ముఖ్యమైన మార్గాలలో ఒకటిగా పనిచేస్తుంది. రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ జెడ్ సర్వీస్ (రైట్స్) ద్వారా 90 కిలోమీటర్ల మేర గుత్తి – ధర్మవరం ప్రాజెక్టు డబ్లింగ్, విద్యుదీకరణ పనులు జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం రూ. 636.38 కోట్లను రైల్వే శాఖ మంజూరు చేసింది. గుత్తి – ధర్మవరం మధ్య 90 కిలోమీటర్ల మేర పనులు దశలవారీగా చేపట్టారు. మొదటగా కల్లూరు–గార్లదిన్నె మధ్య 13 కిలోమీటర్ల దూరం డబ్లింగ్, విద్యుద్దీకరణ పనులు సెప్టెంబర్ 2019లో పూర్తయ్యాయి. దీని తర్వాత చిగిచెర్ల, జంగాలపల్లి మధ్య 11 కిలోమీటర్లు జూన్ 2020లో, గార్లదిన్నె–తాటిచెర్ల మధ్య 9 కిలోమీటర్లు నవంబర్, 2020లో మొదలయ్యాయి. 2021 అక్టోబర్‌లో కల్లూరు – గుత్తి మధ్య 27కి.మీలు, ఆగస్ట్ 2022లో తాటిచెర్ల – జంగాలపల్లి మధ్య 19 కి.మీల పనులు ప్రారంభం అయ్యాయి. చివరి భాగంలో 11 కిమీల దూరం వరకు మొత్తం పనులు పూర్తి అయ్యాయి. ఈ పనుల పూర్తితో రైళ్ల రాకపోకలు సాగించేలా మొత్తం ప్రాజెక్ట్ ప్రారంభం అయ్యింది.

ఈ రైల్వేలైన్ అందుబాటులోకి రావడం వల్ల రైళ్ల రాకపోకలకు రద్దీని తగ్గిస్తుంది. బెంగళూరు, ఆ తర్వాతి స్టేషన్లకు ఎక్కువ సంఖ్యలో ప్యాసింజర్ సరుకు రవాణా చేసే రైళ్లను నడపడానికి వీలు కల్పిస్తుంది. ఇది సెక్షన్‌లోని రైళ్ల సగటు వేగాన్ని పెంచడంలో కూడా సహాయపడుతుంది. మెరుగైన రైలు కనెక్టివిటీతో ఈ ప్రాంతం సామాజిక–ఆర్థిక అభివద్ధికి కూడా సహాయపడుతుంది. ధర్మవరం–బెంగళూరు మధ్య నైరుతి రైల్వే పరిధిలోని డబుల్‌లైన్ పనులు కూడా వీటితోపాటు ప్రారంభం అయ్యాయి. ఈ కీలక ప్రాజెక్టును ప్రారంభించడంలో చురుగ్గా పాల్గొన్న దక్షిణ మధ్య రైల్వే నిర్మాణ సంస్థ, రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ (రైట్స్) బందం, గుంతకల్ డివిజన్ అధికారులు, సిబ్బంది బందాన్ని ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ అరుణ్ కుమార్ జైన్ అభినందించారు. ఈ ముఖ్యమైన విభాగాన్ని డబ్లింగ్ చేయడం వల్ల రైలు రాకపోకల కార్యాచరణ సామర్థ్యాన్ని పెంపొందించవచ్చని ఈ విభాగంలో ప్యాసింజర్‌చ సరుకు రవాణా రైళ్ల రాకపోకలను సులభతరం చేస్తుందని జనరల్ మేనేజర్ పేర్కొన్నారు.

గాడిదల సంఖ్య పడిపోతోంది..!

◆పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి
◆బ్రూక్ సీనియర్ ప్రోగ్రామ్ లీడర్ ప్రియా పాండే

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

దేశంలో గాడిదల సంఖ్య గణనీయంగా పడిపోతుండటం ఆందోళన కలిగించే అంశమని బ్రూక్ స్వచ్ఛంద సంస్థ ప్రోగ్రామ్ లీడర్ ప్రియా పాండే తెలిపారు. దేశంలో గాడిదల సంఖ్య తగ్గిపోతుండటంపై పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రెడ్డిపల్లిలోని ప్రాంతీయ శిక్షణా కేంద్రంలో సదస్సు జరిగింది. ఈ సదస్సులో డాక్టర్ ప్రియా పాండే ముఖ్య ఉపన్యాసం చేశారు. గణనీయంగా తగ్గిపోతున్న జాతుల్లో గాడిదలున్నాయని చెప్పారు. గాడిద మాంసలో ఔషధ గుణాలున్నాయంటూ ఉన్న ప్రచారంతో పెద్దఎత్తున మాంసం ఎగుమతులు, దేశం నుంచి బయటకు జరుగుతున్నాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో మరింత అధికంగా గాడిదల మాంస విక్రయాలు జరుగుతున్నాయని తెలిపారు. వీటిపై పరిశీలించిన తరువాత గాడిద వధ శాలలపై చర్యలు తీసుకోవాలన్న ఒత్తిడిని పెంచాల్సిన అవసరముందని చెప్పారు. ఈ అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాల్సి అవసరముందన్నారు. పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ స్వామి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోనూ గాడిదల సంఖ్యలో తగ్గుదల ఏటా కనిపిస్తోందన్నారు. ఇలాగే జరుగుతోపోతే కొంతకాలానికి గాడిదల సంఖ్య తగ్గిపోయే ప్రమాదమూ లేకపోలేదన్నారు. రాష్ట్రంలో ఎక్కడా గాడిదలను వధించడానికి వీల్లేదన్న చట్టముందని గుర్తు చేశారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా కొన్ని చోట్ల వీటి వధ జరుగుతోందని పేర్కొన్నారు. ఈ రకంగా జాతులు అంతరించే స్థాయి వెళ్లడం అన్నది ప్రకృతి సమతుల్యతను దెబ్బతీస్తుందన్నారు. ఈ సందర్భంగా రజక వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు నాగభూషణం మాట్లాడుతూ ఒకప్పుడు గాడిదల ద్వారా బరువైన వస్తువుల రవాణా జరిగేదన్నారు. బట్టలు, కట్టెలు, మట్టి వంటివి మోయడానికి వినియోగించే వారమని చెప్పారు. ఇప్పుడు వాహనాలు అందుబాటులోకి వచ్చాక వాటి వినియోగం, అవసరం లేకుండాపోయిందన్నారు. దీంతో ఇవి కనుమరుగవుతున్నట్టు చెప్పారు. ఇటీవలి కాలంలో గాడిద పాలు మంచిదన్న ఆలోచనతో అక్కడకడ్క వాటిపాలు అమ్ముకునేందుకు మాత్రమే ఉంటున్నాయన్నారు. వెంకటేశ్ అనే వ్యక్తి మాట్లాడుతూ పాలకు పెరుగుతున్న డిమాండ్‌ను చూసి వడ్డిపల్లి వద్ద గాడిదల ఫామ్‌ను తాము ఏర్పాటు చేసామని తెలిపారు. ఇప్పుడు మార్కెటింగ్‌కు అవకాశం పెద్దగా లేకుండా ఉందని చెప్పారు. ప్రభుత్వం వైపు నుంచి సహకారం అవసరమన్నారు. ఈ పామ్ గురించి అక్కడికి వచ్చిన అధికారులు, తోటి వారు ఆసక్తిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ కర్నూలు జిల్లా అధికారి రామచంద్రయ్య, అనంతపురం జిల్లా అధికారి సుబ్రమణ్యం, జిల్లా పరిషత్ సిఇఒ భాస్కర్‌రెడ్డి, బ్రూక్స్ ప్రతినిధులు డాక్టర్ సరిత నేగి, గౌరిశా భరద్వాజ్, రజక వృత్తిదారుల సంఘం నాయకులు నారాయణస్వామి, కసాపురం ఆంజినేయులు, పశు సంవర్ధక శాఖ ఎడి రామచంద్రారెడ్డి, రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ చిట్రా శ్రీనివాసులు

ఉద్యోగులు సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి-గుత్తి

సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీవో చిట్రా శ్రీనివాసులు పేర్కొన్నారు. సమయ పాలన పాటించని గ్రామ సచివాలయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయ మహిళా పోలీసులు, ఎఎన్ఎం, సంక్షేమ కార్యదర్శులతో ఎంపీడీవో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గుత్తి మండలంలోని 13 సచివాలయాల పరిధిలో ఉద్యోగులు సమయానికి విధులకు హాజరు కావడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. ప్రతి ఉద్యోగి ఉదయం 9.30 గంటలకు వచ్చి సాయంత్రం 5.30 గంటల వరకు తప్పకుండా విధుల్లో ఉండాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహించిన వారిని గుర్తించి కలెక్టర్‌కు నివేదిక పంపుతామని హెచ్చరించారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో రోజూ పర్యటించి సమస్యలను గుర్తించి తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ఎంపీడీవో పిఎంజెవై, మిషన్ అత్యోదయపై సచివాలయ ఉద్యోగులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ శివాజీరెడ్డి, ఎంఇఒ బి.రవి నాయక్, ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగులు అబ్దుల్, వాసు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు, సర్టిఫికెట్లతో విద్యార్థులు

డిగ్రీ కాలేజీ విద్యార్థులకు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి-అనంతపురం

జాతీయ గణాంక కార్యాలయం ఆధ్వర్యంలో అనంతపురం ఆర్ట్స్ కళాశాలలోని సమావేశ మందిరంలో డిగ్రీ కళాశాల విద్యార్థులకు గురువారం క్విజ్ పోటీలు నిర్వహించారు. తొలుత 'అధికారిక గణాంకాల వ్యవస్థ, ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లోని ఉద్యోగ ఉపాధి అవకాశాలు' గోష్ఠి చేపట్టారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని 9 కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వక్తల ప్రసంగం అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి జాతీయ గణాంక కార్యాలయం, కడప సంచాలకులు ఎ.నాగమల్లేశ్వరరావు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ శశాంకమౌళి, ఎన్ఆర్‌సి కోఆర్డినేటర్ పిసి.లక్ష్మీకాంత్, సాంఖ్యక శాస్త్ర విభాగాధిపతి డా.బి.చంద్రశేఖర రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని సీనియర్ గణాంక అధికారి కె.హరి నాగేష్ పర్యవేక్షించారు.

బడ్జెట్‌లో అన్యాయంపై నేడు ధర్నాలు : సిపిఎం

ప్రజాశక్తి అనంతపురం కలెక్టరేట్




వి.రాంభూపాల్

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా, సంక్షేమ పతకాలు, సబ్సిడీలపై కోతలు విధించి ప్రజలపై భారాలు, అదానీ అవినీతిపై శుక్రవారం నాడు జిల్లాలోని అన్ని మండల కార్యాలయాల ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి భారీ కోతలు విధించిందన్నారు. ఎరువులపై సబ్సిడీలు తగ్గించి ధరలు పెంచిదని, పెరిగిన ధరలు, ఎరువులు అందక రైతులు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని తెలిపారు. అప్పులు రెట్టిపు అయ్యాయని తెలిపారు. ఆత్మహత్యలు పెరిగాయని చెప్పారు. కౌలు రైతులను కనీసం గుర్తించడానికి కూడా కేంద్ర ప్రభుత్వం నిరాకరించడం దుర్మార్గం అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు అండగా ఉన్న ఉపాధి హామీ పథకానికి ఈ బడ్జెట్‌లో భారీ కోతలు విధించారని తెలిపారు. ఇది పేదల కడుపు కొట్టడానికే అన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను ఎత్తివేశారన్నారు. బడ్జెట్‌లో సంక్షేమ నిధులు తగ్గిపోయాయని తెలిపారు. ప్రజా పంపిణీ ద్వారా సరఫరా అయ్యే సబ్సిడీ బియ్యాన్ని రద్దు చేయడం చూస్తే కేంద్రానికి పేద ప్రజలపై ఏ పాటి ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ధరల పెరుగుదలతో సతమతమవుతున్న జనానికి మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లుగా ఈ బడ్జెట్ భారాలు కోలుకోలేని దెబ్బతీస్తాయని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా నిరాకరిస్తూ, విభజన హామీలు ఏ ఒక్కటీ అమలు కాలేదన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు నామమాత్రంగా నిధులు విడుదల చేశారని తెలిపారు. వెనుకబడిన ప్రాంతాలకు నిధులివ్వకపోగా పుండుపై కారం చల్లినట్లుగా తుంగభద్ర కెనాల్స్ కింద నీటి సరఫరాను దెబ్బకొట్టే కర్నాటకలోని అప్పర్ భద్రకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడం దారుణంగా ఉందన్నారు. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల మధ్య విద్వేషాలు పెంచి రానున్న కర్ణాటక ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కుయుక్తులు పన్నిందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరణ ఆపలేదన్నారు. కడప ఉక్కు, రాజధాని నిర్మాణం, పోలవరానికి నిధులు ఇవ్వలేదన్నారు. అదానీ కుంభకోణం అంతర్జాతీయంగా భారతదేశానికి తలవంపులు తెచ్చిందన్నారు. చిన్న మదుపుదార్లు, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఎల్ఐసిని ముంచేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆస్తుల్ని, ప్రకృతి వనరులను అదానీపరం చేస్తుండటాన్ని సిపిఎం తీవ్రంగా ఖడిస్తోందన్నారు. జిల్లాలో వేలాది ఎకరాలు భూములను అదానీ కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం అప్పగించడం దారుణంగా ఉందని విమర్శించారు. అధికార ప్రతిపక్ష పార్టీలు అదానీ అవినీతికి వ్యతిరేకంగా ముందుకు రావాలని కోరారు. రాష్ట్రానికి ఇంత పెద్ద ఎత్తున అన్యాయం జరుగుతున్నా పార్లమెంట్‌లో రాష్ట్రానికి చెందిన ఎంపీలు నోరెత్తడం లేదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రానికి తాకట్టు పెట్టడం పట్ల సిపిఎం తీవ్రంగా నిరసిస్తోందన్నారు. శుక్రవారం నాడు జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ కూడలిలో ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు అందరూ ఇందులో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని వినతి

కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్సీ శివరామిరెడ్డి



మూర్ఛ వ్యాధితో మృతిచెందిన గొర్రెలు

ప్రజాశక్తి-ఉరవకొండ

మూర్ఛవ్యాధితో గొర్రెలు నష్టపోయిన కాపరులను ఆదుకోవాలని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి కలెక్టరుకు వినతి చేశారు. కూడేరు మండలం కలగల్లు గ్రామానికి చెందిన ప్రభాకర్, రామాంజి, ఆదెప్ప తదితర గొర్రె కాపరులు తమ గొర్రెలను మేపుకొంటూ బుధవారం రాత్రి విడపనకల్ మండలం హావళిగి గ్రామ సమీపంలో బసచేశారు. గురువారం ఉదయం మందలోని 30 గొర్రెలు మరణించి ఉండడాన్ని గమనించి విలపించారు. విషయాన్ని ఫోన్ ద్వారా ఎమ్మెల్సీ శివరామిరెడ్డికి వివరించి న్యాయం చేయాలని కోరారు. స్పందించిన ఆయన సంబంధిత అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కాంతమ్మతో మాట్లాడి ఘటనాస్థలానికి వైద్యాధికారులను పంపారు. వారు పరిశీలించి 1500 గొర్రెలలో దాదాపు 30 మూర్ఛవ్యాధితో మరణించాయని తెలిపారు. మిగిలిన వాటికి అలాంటి వ్యాధి సోకకుండా వ్యాక్సిన్ వేస్తామని ఎమ్మెల్సీకి తెలిపారు. మరణించిన గొర్రెలకు బీమాలేని కారణంగా నష్టపరిహారం అందించలేమని వైద్యాధికారులు తెలియజేశారు. ఎమ్మెల్సీ శివరామిరెడ్డి విషయాన్ని ఫోన్ ద్వారా కలెక్టర్ కేతన్ గార్గ్ దృష్టికి తీసుకెళ్లారు. గొర్రెల కాపరులను ఆదుకోవాలని కోరారు. స్పందించిన కలెక్టర్ కేతన నివేదిక అందగానే తప్పకుండా ఆర్థికసాయం అందజేస్తామని చెప్పారు. మూర్ఛవ్యాధిని నివారించడానికి చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

జోరుగా ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్లు

పట్టభద్రులకు 33, ఉపాధ్యాయ స్థానానికి 12 దాఖలు

ప్రజాశక్తి-అనంతపురం

మండలి ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ జోరుగా సాగుతోంది. అభ్యర్థులు పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. కడప, అనంతపురం, కర్నూల్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సబంధించి గురువారం నాడు పట్టభద్రుల నియోజక వర్గంలో 33 నామినేషన్లు, ఉపాధ్యాయుల నియోజక వర్గంలో 12 నామినేషన్లు, స్థానిక సంస్థల నియోజకవర్గంలో 2 నామినేషన్లు దాఖలు అయ్యాయి. కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్ గార్గ్ అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు.



జిల్లా ఎన్నికల పరిశీలకులు ప్రవీణ్ ప్రకాష్, కె.సునీతలకు స్వాగతం పలుకుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్

జిల్లాకు ఎన్నికల పరిశీలకులు

పోలింగ్ కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి-అనంతపురం

శాసనమండలి ఎన్నికల నిర్వహణకు సంబంధించి నియమించబడిన ఎన్నికల పరిశీలకులు ప్రవీణ్ ప్రకాష్, కె.సునీతలు గురువారం అనంతపురం విచ్చేశారు. వీరికి కలెక్టరేట్‌లో కలెక్టర్ కేతన్ గార్గ్ పూల బొకేలు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం వారు జిల్లాలో పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఎన్నికల నిర్వహణపై చర్చించారు.



బుక్కరాయసముద్రం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు పోలా భాస్కర్

పోలింగ్ కేంద్రాల పరిశీలించిన ఎన్నికల పరిశీలకులు డా॥పోలా భాస్కర్

కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల నిర్వహణకు సంబంధించి నియమించబడిన ఎన్నికల పరిశీలకులు డా॥పోలా భాస్కర్ గురువారం నాడు జిల్లాలో పర్యటించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా కలెక్టరేట్‌లో కలెక్టర్ కేతన్ గార్గ్ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఎన్నికల పరిశీలకులు బుక్కరాయ సముద్రం మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని అసిస్టెంట్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్, అనంతపురం ఆర్డీవో మధుసూదన్, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. అక్కడి నుంచి రాప్తాడు మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.

మైనార్టీల సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తా

వైసిపి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు సైఫుల్లా బేగ్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ముదున్నరేళ్ల వైసీపీ పాలనలో మైనార్టీల సంక్షేమానికి అమలు చేసిన సంక్షేమ పథకాలను ముస్లిం మైనారిటీలకు వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వైసిపి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు, అనంతపురం నగరపాలక సంస్థ కార్పొరేటర్ సైఫుల్లా బేగ్ పేర్కొన్నారు. వైసీపీ అనుబంధం మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులుగా తన నియామకానికి సహకరించిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, కృషిచేసిన అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డికి, జిల్లాలోని ప్రజాప్రతినిధులు, జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర మైనారిటీ సెల్ అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలియచేశారు. గతంలో అర్బన్ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులుగా పని చేసిన అనుభవంతో జిల్లాలోని ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో 2024 ఎన్నికల్లో ముస్లిం మైనారిటీలు వైసీపీ వెంట నడిచేలా కృషి చేస్తానని చెప్పారు. టీడీపీ పాలనలో ముస్లిం మైనారిటీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటే నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తూ డిప్యూటీ సీఎం, మండలి ఉపాధ్యక్షులుగా, ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించారన్నారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సైతం 10 మందికి కార్పొరేటర్లుగా, మేయర్, మార్కెట్ యార్డ్ చైర్మన్, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్, జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్‌గా అర్బన్ నియోజకవర్గ పరిధిలో ముస్లిం మైనారిటీలకు గతంలో ఎన్నడూ లేని రీతిలో అవకాశం కల్పించారని గుర్తు చేశారు. జిల్లాలో పార్టీ బలోపేతం కోసం అందరి సహకారంతో తన వంతు కషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

డ్రెయినేజీ సమస్యను పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని బీసీ కాలనీలో నెలకొన్న డ్రెయినేజీ సమస్యను పరిష్కరిస్తామని మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ శరత్‌చంద్ర, కౌన్సిలర్ కె.సుచరితారెడ్డి పేర్కొన్నారు. గురువారం బీసీ కాలనీలో వారు పర్యటించారు. సమస్యలు వారి దృష్టికి రావడంతో పర్యటించి పరిష్కరిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా నాయకులు కె.మధుసూదన్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య, శానిటేషన్ కార్యదర్శి వనజాక్షి, సచివాలయాల కన్వీనర్లు భాస్కర్ రెడ్డి, రెడ్డమ్మ తదితరులు పాల్గొన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న జొన్నలగడ్డ నిర్మలాదేవి

నిత్యావసర సరుకులు అందజేత

శింగనమల : ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందిన శింగనమల మండల కేంద్రానికి చెందిన చాకలి మోహన్ కుటుంబానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి మాతృమూర్తి జొన్నలగడ్డ నిర్మలాదేవి నిత్యావసర సరుకులను అందజేశారు. గురువారం మృతుని కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. సంఘటన వివరాలను మృతుడి భార్య వెంకటలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని పిల్లలకు అండగా తామంతా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. ప్రభుత్వ గృహం మంజూరు చేస్తామని, ప్రమాద బీమా అందించేలా కృషిచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నాగ మునెమ్మ, ఉప సర్పంచి లక్ష్మీనారాయణరెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ పట్నం నగేష్, వెంకటరమణ, ఎంపీటీసీ ఉమా, వైసీపీ నేతలు ఉల్లికల్లు చెన్నమ్మ, శకుంతలమ్మ, డాక్టర్ శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి ఆర్థికచేయూత

శింగనమల : మండలంలోని గురుగుంట్ల గ్రామానికి చెందిన వరికూటి ఎస్తేరమ్మ, పాస్టర్ వరికూటి మెషే కుమారుడు రాజు వివాహానికి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఆర్థిక సాయం చేశారు. గురువారం రాజు తండ్రికి రూ.10 వేలు నగదు అందజేశారు. వారి వైవాహిక జీవితం సుఖ సంతోషాలతో ముందుకుసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దైవయత్నం, రత్నమయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కొళాయిలు తొలగించకుంటే జరిమానా

నార్పల : నార్పల మేజర్ పంచాయతీలో ఎక్కడైనా అనుమతి లేకుండా అక్రమంగా కొళాయిలు వేసుకొని ఉంటే వాటిని మూడు రోజుల్లో తొలగించాలని.. లేని పక్షంలో అపరాధ రుసుము విధిస్తామని పంచాయతీ కార్యదర్శి అశ్వర్థ నాయుడు తెలిపారు. అక్రమ కొళాయిలకు మూడు రోజుల్లోపు గ్రామ పంచాయతీ కార్యాలయంలో డిపాజిట్ చెల్లించి రసీదు పొందాలన్నారు. లేదంటే కనెక్షన్ తొలగించడంతో పాటు అపరాధ రుసుము విధించి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గురుకుల పాఠశాల తనిఖీ

బొమ్మనహాల్ : మండల కేంద్రంలోని కస్తూర్బా గురుకుల పాఠశాలను ఎంఇఒ తిమ్మప్ప గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్ల సౌకర్యం లేదని, ఉడికీ ఉడకని ఆహారం అందిస్తున్నారని, రాత్రి వేళల్లో ఒక్కసారే అన్నం వడ్డిస్తున్నారని.. మరోసారి అడిగితే లేదు పొమ్మంటున్నారని తదితర సమస్యలను విద్యార్థులు ఎంఇఒ దృష్టికి తీసుకెళ్లారు. అత్యవసర సమయంలో తల్లిదండ్రులతో మాట్లాడేందుకు ఫోన్ సౌకర్యం కల్పించాలని కోరారు. స్పందించిన ఎంఇఒ పాఠశాలలో ఫిర్యాదుల బాక్సు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఎస్ఒ, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంఇఒ విద్యార్థులకు భరోసా కల్పించారు.

విశ్వేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు

ఉరవకొండ : వైసిపి బిసి విభాగం జిల్లా అధ్యక్షులుగా తనను నియమించినందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డికి, అందుకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డికి సీపీ.వీరన్న కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ..బీసీలు అంటే వెనుకబడిన వారు కాదని.. వెన్నెముక లాంటి వారిని సిఎం జగన్ గుర్తించారన్నారు. దీనిని గుర్తుపెట్టుకుని జిల్లాలోని బిసిలు ఐక్యంగా మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా బిసి అనుబంధ శాఖల బలోపేతానికి కృషిచేస్తానని తెలియజేశారు.



యువగలం పాదయాత్రలో శ్రావణీశ్రీ

యువగళం పాదయాత్రలో బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-శింగనమల

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 25వ రోజు యువగళం లోకేష్ పాదయాత్రలో శింగనమల నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టిడిపి బలోపేతానికి కృషి చేయాలని, సిఎం చంద్రబాబునాయుడు సిఎం అయితేనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని అన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రం పది సంవత్సరాలు వెనక్కి వెళ్లిందన్నారు.

యథేచ్ఛగా ప్రయివేటు విద్యా వ్యాపారం

ఒకే స్కూల్లో రెండు కాలేజీలు, హాస్టల్
కొరవడిన విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

ఒక ఇంగ్లీష్ మీడియం స్కూల్లో రెండు కాలేజీలు, ఒక హాస్టల్‌ను నడుపుతూ ఓ ప్రయివేటు విద్యాసంస్థ విద్యా వ్యాపారం చేస్తోంది. తాడిపత్రి రూరల్ ప్రాంతంలోని పుట్లూరు రోడ్డు ఆటోనగర్ సమీపంలోనే నిర్వహిస్తున్నా విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ చేయకపోవడం గమనార్హం. విద్య అందరికీ అందాలని ప్రభుత్వం ఎన్ని కార్యక్రమాలను ప్రవేశపెడుతున్నా అవి ప్రయివేటు సంస్థలకు ఓ వరంలాగా మారుతోంది. ఒక స్కూలు, కాలేజీ నడపాలంటే ఎన్నో నిబంధనలను అధికారులు యాజమాన్యానికి సూచిస్తారు. ఒకే భవనంలో ఇంగ్లీష్ మీడియం స్కూల్, జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీ, టిటిసి కళాశాలతో పాటు బాలుర, బాలికల హాస్టల్‌ను సైతం నిర్వహిస్తున్నా ఎంఇఒ, ఆర్ఐలతో పాటు విద్యాశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. దీనికి తోడు ప్రభుత్వం నుండి వచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా తమకే ఇవ్వాలని కాలేజీలో చేరే సమయంలోనే హుకుం జారీ చేస్తున్నారు. విద్యార్థుల నుంచి భారీగా ఫీజులు దండుకుంటున్నారే తప్ప కాలేజీలో సరైన వసతులు కల్పించలేదు. కాలేజీలో ఎటుచూసినా చెత్తాచెదారంతో నిండిపోయిందని, బాత్‌రూములు దుర్వాసన వేస్తూ అధ్వానంగా ఉన్నాయని విద్యార్థులు వాపోతున్నారు. కాలేజీకి రాకపోయినా పర్వాలేదు ఫీజు చెల్లిస్తే సర్టిఫికెట్ ఇస్తామని యాజమాన్యం చెబుతున్నారు. కాలేజీకి వచ్చి చదవాల్సిన అవసరం లేదంటున్నారు. పరీక్షలు ఉంటే కబురు పెడతామని చెబుతున్నారు. అధికారుల పర్యవేక్షణ ఏమీ ఉండదని విద్యార్థులను మభ్యపెడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి విద్యను వ్యాపారం చేస్తున్న తాడిపత్రిలోని ప్రయివేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు, పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఒకే భవనం మూడు కాలేజీలు దారుణం



తాడిపత్రి రూరల్ పరిధిలోని ఒకే స్కూలు భవనంలో రెండు కాలేజీలు, ఒక హాస్టల్ నిర్వహిస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం చూస్తే మామూళ్ల మత్తులో వారు జోగుతున్నారన్న అనుమానం కలగకమానదు. కళాశాలలో పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. బడాబాబుల అండదండలతో కళాశాల నిర్వహిస్తుండడంతో స్థానిక అధికారులు నిమ్మకు నీరెక్కినట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖాధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రయివేటు కళాశాలపై చర్యలు తీసుకోవాలి

-వరుణ్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకుడు



నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కళాశాల ఇదే..

పాచిపట్టిన నీరే గతి..!

తాగునీరు అందించాలని విజ్ఞప్తి



వ్యవసాయ బావుల వద్ద నీరుతెస్తున్న మహిళలు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

బొమ్మనహాల్ మండలంలోని కందేపల్లి, గోవిందవాడ గ్రామాలకు తాగునీరు పేరుతో వేదవతి నదిలో పాచిపట్టిన నీటిని సరఫరా చేస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. కందేపల్లి గ్రామంలో 4 వేల జనాభా ఉంది. అధికారులు గ్రామానికి తాగునీటికి బదులు పక్కనే ఉన్న వేదవతి నదిలో పాచిపట్టిన నీటిని సరఫరా చేస్తున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఆ నీటిలో కూడా మురుగునీరు కలుస్తుండడంతో దుర్వాసన వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ నీరు పశువులు తాగేందుకు కూడా పనికి రాదని, మనుషులకు ఎలా సరఫరా చేస్తారని గ్రామస్తులు అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రశ్నిస్తున్నారు. ఆ నీటిని తాగుతున్న కొందరు రోగాల బారిన పడుతున్నారు. దీంతో గ్రామస్తులు కిలో మీటరు దూరం వెళ్లి ద్విచక్రవాహనాల్లో, ఎడ్లబండ్లపై బిందెలతో తాగునీరు తెచ్చుకోవాల్సి దుస్థితి. వేదవతి నదిలో బోరు వేసి తాగునీరు సరఫరా చేయాలని కందేపల్లి, గోవిందవాడ గ్రామస్తులు కోరుతున్నారు. పంచాయతీలకు నిధులు లేకపోవడం, అధికారుల నిర్లక్ష్యం గ్రామస్తులకు శాపంగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై బొమ్మనహాల్ విలేకరి ఎంపీడీవో షకీలాను వివరణ కోరగా.. ఆ గ్రామాలకు ఏ నీరు వదులుతున్నారో తెలియదని, పూర్తి వివరాలు తెలుసుకుంటానని దాటవేయడం గమనార్హం.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ఆత్మకూరు : ఆత్మకూరు మండల కేంద్రంలోని వైఎస్సార్ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు. 20 రోజులుగా కాలనీకి నీరు సరిగా సరఫరా కావడంలేదన్నారు. రాత్రి 11 గంటల సమయంలో ఓవర్ హెడ్ ట్యాంక్ వద్దకు వెళ్లి అది నిండేంతవరకు పడిగాపులుకాసి నీరు పట్టుకోవాల్సి వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. సమస్యపై పంచాయతీ కార్యదర్శిని ఫోన్ ద్వారా సంప్రదిస్తే సమాధానం ఇవ్వడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు. లేనిపక్షంలో గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

నాగప్పకు ప్రభుత్వ విప్ అభినందన

రాయదుర్గం : రాయదుర్గం పట్టణం చేనేత సామాజిక వర్గానికి చెందిన వైసిపి నాయకుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చుంచుల నాగప్పను పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షులుగా నియమించడంతో ఆయనకు రాయదుర్గం శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అభినందనలు తెలిపారు. చేనేత విభాగం అధ్యక్షులుగా జిల్లాలోని చేనేతల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. వీరితోపాటు పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్ర రెడ్డి, పార్టీ నాయకులు పోరాలు శివ తదితరులు నాగప్పకు శాలువ కప్పి, పూలమాలలు వేసి అభినందించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుత్తి : గుత్తి మండల వ్యాప్తంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఎస్పీడీసీఎల్ సహాయ ఇంజినీర్ ఎం.శ్రీకుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. 220 కెవి వద్ద 33 కెవి లైవ్ మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన చెప్పారు. పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

అణగారిన వర్గాల సాధికారతకు ప్రభుత్వం బాటలు

ఎంపిపి చందా చంద్రమ్మ

ప్రజాశక్తి-ఉరవకొండ

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్దపీట వేయడం ద్వారా సిఎం జగన్ ప్రభుత్వం ఆ వర్గాల సాధికారతకు బాటలు వేస్తోందని ఎంపిపి చందా చంద్రమ్మ పేర్కొన్నారు. గురువారం స్థానిక చౌడేశ్వరి కాలనీలో ఎంపీపీ చందా చంద్రమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, సర్పంచి లలిత, రాష్ట్ర డైరెక్టర్లు గోవిందు, జోగి వెంకటేష్, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ శాసన మండలిలో 18 ఎమ్మెల్సీ స్థానాలకు 14 స్థానాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సిఎం జగన్ కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అంబేద్కర్, మహాత్మా పూలే ఆశయాలకు అనుగుణంగా వైసిపి పాలన సాగుతోందని కొనియాడారు. రాష్ట్ర చరిత్రలోనే గతంలో ఎన్నడూ లేని విధంగా 70 శాతం మంత్రి పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కేటాయించి సామాజిక విప్లవానికి సిఎం జగన్ నాంది పలికారన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్‌ను సిఎంను చేసి రుణం తీర్చుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ మండల, గ్రామాల కన్వీనర్లు ఆసిఫ్, తేజోనాథ్, కోఆప్షన్ మెంబర్ పామిడి సలీమ్, టౌన్ బ్యాంక్ అధ్యక్షుడు సాధు కుల్లాయి స్వామి, డైరెక్టర్ మీనుగ ఎర్రిస్వామి, జిల్లా వక్స్ బోర్డు మెంబర్ మీరం బాషా, నాయకులు కృష్ణమూర్తి, ఎంఎల్ఓ ముండాస్ ఓబులేసు, సచివాలయం-5 కన్వీనర్ నిర్మల, కురుబ చిన్న భీమా, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపిపి చందా చంద్రమ్మ తదితరులు

సచివాలయం తనిఖీ

నార్పల : బి.పప్పూరు గ్రామ సచివాలయాన్ని ఈవోఆర్డీ లక్ష్మీనరసింహ గురువారం తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులను పరిశీలించి మెరుగైన చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసి ఉంచుకోవాలని సూచించారు. ప్రతి రోజూ సాయంకాలం 3 గంటల నుండి 5 గంటల వరకు కచ్చితంగా స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజలు నుండి అర్జీలను స్వీకరించాలన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పెద్దన్న, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి చిన్న రాయుడు, వీఆర్వో కొండయ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్ జగదీష్, డిజిటల్ అసిస్టెంట్ అమరా పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పొలంబడిపై శిక్షణ

ప్రజాశక్తి-గార్లదిన్నె

మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకట్రాముడు, శాస్త్రవేత్త దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో రైతులకు గురువారం పొలంబడిపై శిక్షణ ఇచ్చారు. వరి పంటపై చీడపీడల నివారణ కోసం చేపట్టే కార్యక్రమాలను వివరించారు. సమగ్ర పంటల యాజమాన్య పద్ధతుల గురించి, పొలంలోని పరిసరాల విశ్లేషణ, చీడ పీడలు నివారణ, ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం, మేలైన రకాల ఎంపిక పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సోమశేఖర్, ఏఈవో స్రవంతి, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షుడికి సన్మానం



బసవరాజును సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఉరవకొండ

పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడుగా నియమితులైన వైసిపి సీనియర్ నాయకులు మీనుగ బసవరాజును ఆయన అభిమానులు, ఆ పార్టీ నాయకులు సన్మానించారు. గురువారం ఆయనకు పూలమాలలు వేసి, శాలువ కప్పి సన్మానించారు. కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. భవిష్యత్తులో ఆయన ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు నిరంజన్ గౌడ్, కోఆప్షన్ సభ్యుడు పామిడి సలీం, వైసిపి నాయకులు ఆటో శీనా, అన్వర్, లెనిన్, రియాజ్, ఎంఎల్ఒ ఓబులేసు, షాహబుద్దీన్, సర్వేయర్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

బిసి కుటుంబంపై దాడి అమానుషం

బాధితులకు అండగా కందికుంట ధర్నా

ప్రజాశక్తి-కదిరి టౌన్

తలుపుల మండలం కుర్లి గ్రామానికి చెందిన బిసి కుటుంబానికి చెందిన హరికుమార్, ఐశ్వర్య కుటుంబంపై వైసిపి నేత కుర్లి శివారెడ్డి దాడి చేయడం అమానుషమని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుండ వెంకటప్రసాద్ అన్నారు. అర్ధరాత్రి హరికుమార్ ఇంటిపై దాడి చేయడంతోపాటు నిండు గర్భిణీ, వృద్ధురాలిపై దాడి చేయడాన్ని నిరసిస్తూ కందికుంట ఆధ్వర్యంలో కదిరి రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గూండాలను ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతేగాకుండా దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ శంకర్‌నాయక్ ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ సందర్భంగా కందికుంట మాట్లాడుతూ వైసిపికి చెందిన సర్పంచు అర్ధరాత్రి సమయంలో దాడికి పాల్పడడమే కాకుండా పశువులను, ట్రాక్టర్‌ను లాక్కొని ఊరు వదిలి వెళ్లిపోవాలని హుకుం జారీ చేయాలని బెదిరించడం విడ్డూరమన్నారు. దీంతో భయపడిన కుటుంబంలోని గర్భిణీ బిక్కుంబిక్కుమంటూ కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిందన్నారు. ఈ ఘటన చూస్తుంటే రాచరిక, అనారికక కాలంలో ఉన్నామా... ప్రజాస్వామ్యంలో ఉన్నామా.. ప్రశ్నించారు. సిఎం సొంత నియోజకవర్గం పులివెందులకు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుర్లి గ్రామంలోనే ఇలా జరుగుతోందంటే పోలీస్ వ్యవస్థ ఏం చేస్తుందో అర్థం చేసుకోవచ్చన్నారు. శాంతిభద్రతలు పరిరక్షించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. వెంటనే గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పికెట్ ఏర్పాటు చేయడంతోపాటు బీసీ కులానికి చెందిన వారిని కాపాడాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, నాయకులు మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల కేంద్రాలను ఎన్నికల సెక్టార్ అధికారి లోకేశ్వర్‌రెడ్డి, తహశీల్దార్ రవినాయక్, ఎస్ఐ సద్గురుడు గురువారం పరిశీలించారు. ఇందులో భాగంగా వసతులపై సిబ్బందితో ఆరాతీశారు. వచ్చే నెలలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులు ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. ఎలాంటి సమస్య తలెత్తినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుత్ షాక్‌తో లైన్‌మెన్ మృతి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం



స్తంభంపైనే మృతిచెందిన లైన్‌మెన్

మండలంలోని కాపర్లపల్లి గ్రామంలో విద్యుత్‌షాక్‌తో ప్రయివేట్ లైన్‌మెన్ గొల్ల నల్లప్ప (32) గురువారం మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన కొందరు రైతులకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేస్తుండగా గుర్తించని మరో ట్రాన్స్‌ఫార్మర్‌కు చెందిన రైతులు హెవీ స్విచ్‌ను ఆన్‌చేశారు. దీంతో లైన్‌మెన్ విద్యుత్‌షాక్‌కు గురై ట్రాన్స్‌ఫార్మర్‌పైనే వేలాడాడు. స్థానిక రైతులు విద్యుత్‌శాఖ అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా చిన్నపాటి మర్మమ్మతుల కోసం హెవీ స్విచ్‌ను ఆఫ్‌చేసి మరమ్మతులు చేయిస్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతునికి భార్య సరోజమ్మ, నాలుగేళ్ల కూతురు ఉంది. విషయం తెలుసుకున్న ఏడీ శ్రీనివాసనాయుడు, ఏఈ సలీం రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'పురం'లో యాచకురాలిపై అత్యాచారయత్నం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ప్రధాన కూడలి రహమత్‌పురం సర్కిల్‌లో బుధవారం అర్ధరాత్రి ఓ వికలాంగ యాచకరాలపై గుర్తు తెలియని దుండగుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. దీంతో ఆమె ప్రతిఘటించడంతో తీవ్రంగా తీవ్రంగా కొట్టి గాయపరిచాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గోరంట్లకు చెందిన బాధితురాలు కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ కొన్ని సంవత్సరాలుగా హిందూపురంలో యాచక వృత్తి చేస్తూ జీవనం సాగిస్తోంది. ఈనేపథ్యంలో రహమత్‌పూర్ సర్కిల్లో ఉన్న ఓ షెల్టర్ వద్ద మరో ఐదుగురు యాచకలతో కలిసి రాత్రి నిద్రిస్తోంది. ఆ సమయంలో ఓ దుండగుడు తాగిన మైకంలో అత్యాచారయత్నానికి ప్రయత్నించడంతో ప్రతిఘటించింది. దీంతో దుండగుడు తలకు తీవ్రంగా కొట్టి పరారయ్యాడు. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న బాధితురాలిని తెల్లవారుజామున గమనించిన చుట్టుపక్కల వారు ఆమెకు ధైర్యం చెప్పి 108 వాహనంలో చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

25 నుంచి వీరాంజనేయస్వామి ఉత్సవాలు

ప్రజాశక్తి-కుందుర్పి

వడ్డేపాలెం గ్రామంలోని గుడిబండ వీరాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలను ఈనెల 25వ తేది నుంచి నిర్వహించనున్నట్లు సర్పంచి గోవిందమ్మ, ఆలయ నిర్వాహకులు తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 25వ తేదీ తెల్లవారుజామున స్వామివారి ఉత్సవ విగ్రహాలను కర్నాటక రాష్ట్రంలోని పరశురాంపుర పట్టణ సమీపంలోని వేదవతి నదికి తీసుకెళ్లి గంగపూజ నిర్వహిస్తామని తెలిపారు. అదే రోజు రాత్రి గ్రామానికి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 25న రథోత్సవం, 27న జిల్లా స్థాయి ఎద్దుల పందేలు, రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తామన్నారు. 28న పొట్టేళ్ల పందెం అనంతరం ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు. ఉన్నత స్థాయి అధికారులు ఆదేశాల మేరకు కళ్యాణదుర్గం డిఎస్‌పి శ్రీనివాసులు, సిఐ శ్రీనివాసులు, డిప్యూటీ తహశీల్దారు తిప్పేస్వామి, హెలిక్యాప్టర్ స్థలాన్ని ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి ఎస్‌కె సుదర్శన్ రెడ్డి, వీఆర్వో సంజీవరెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమీక్ష సమావేశం

నార్పల : జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి, మండల ప్రత్యేక అధికారి ఎస్ మహమ్మద్ రఫీ స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధనలో భాగంగా వివిధ శాఖల ప్రగతి నివేదికను పరిశీలించారు. తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. లక్ష్యాలను నిర్దేశించి వాటిని తప్పకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది ఉదయం, సాయంత్రం తప్పక హాజరువేయాలని, ప్రతి రోజూ స్పందన నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ పి.దివాకర్, తహశీల్దార్ శ్రీనారాయణ స్వామి, ఎంఇఒ కృష్ణయ్య, ఈవోఆర్డీ జి.లక్ష్మీనరసింహ, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ రవిశంకర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు వాణి, ఉమాదేవి, మధుమాలిని, అక్కులప్ప సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై తొలగని ఇసుక

ప్రజాశక్తి-రొద్దం

పెన్నానదిలో నీటి ప్రవాహం నిలిచినా రోడ్డు సమస్య మాత్రం తీరలేదు. గత వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు పెన్నానది పొంగి ప్రవహించిన విషయం తెలిసిందే. దాదాపు కొన్ని నెలల కొర్దీ పెన్నా ప్రవాహం తగ్గకపోవడంతో మండలంలోని కొన్ని గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెన్నానది ప్రవాహం నిలిచి పోయి నెలలు గడిచినా దాదాపు 3 నుంచి 5 అడుగుల వరకు ఇసుక రావడంతో పాత రోడు పూర్తిగా పూడిపోయింది. దీంతో వాహనదారులు నానాతిప్పలు పడుతున్నారు. ముఖ్యంగా మండలంలోని నరనాగిపల్లి, కుర్లపల్లి, చిన్నకోడిపల్లి, నల్లూరు, దందేపల్లి గ్రామాలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా రొద్దం నరణాగేపల్లి సచివాలయం నుంచి మండల కేంద్రానికి రావాలంటే కిలోమీటరు మేర చుట్టూ తిరిగి రావాల్సి ఉంది. ఆఖరికి సచివాలయ సిబ్బంది సైతం విధులకు రావాలన్నా తీవ్ర అంతరాయం నెలకొంటోందని స్థానికులు అంటున్నారు. కావున కనీసం రోడ్డు వేయకపోయినా కొద్దిపాటి ఇసుకను తొలగిస్తే సమస్య తీరుతుందని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థికి ఉపాధ్యాయుల ఆర్థికసాయం

ప్రజాశక్తి-లేపాక్షి

మండలం పరిధిలోని చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతూ బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న అజయ్‌కుమార్‌కు ఉపాధ్యాయులు గురువారం ఆర్థికసాయం అందజేశారు. లేపాక్షి మండలం ఉప్పరపల్లి గ్రామనికి చెందిన పెయింటర్ శివప్ప, నాగమణి కుమారుడు అజయ్‌కుమార్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మూడు నెలలుగా వివిధ ఆసుపత్రులో చికిత్స పొందగా దాదాపు రూ.2 లక్షల వరకూ ఖర్చు అయింది. తెలుసుకున్న పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పోగు చేసి బాధితుడి తండ్రి శివప్పకు గురువారం రూ.54,780 మొత్తాన్ని ఫోన్‌పే ద్వారా పంపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలి

రాష్ట్ర ఎంటోమొలజిస్టు కొండారెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించి ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలని రాష్ట్ర ఎంటోమొలజిస్ట్ కొండారెడ్డి సూచించారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వ్యాయామం, మాతాశిశు సంరక్షణ, సీజనల్ వ్యాధులు, రక్తహీనతపై పర్యవేక్షణలో భాగంగా స్థానిక సిబ్బందితో సమీక్షించారు. ఇందులో భాగంగా పిహెచ్‌సిలో గర్భిణులకు చేస్తున్న రక్తపరీక్షలు, గ్రామంలో నిర్వహించి ఆరోగ్య కార్యక్రమాలపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రైడే డ్రైడే పాటించి జ్వరాల బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పోషకాహారం తీసుకుని ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలన్నారు. అలాగే వ్యాయామం చేయడం వల్ల శారీరక ఉల్లాసం, మానసిక ఒత్తిడి తగ్గి ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు నాగరాజునాయక్, జ్యోష్ణ, సిహెచ్ఒ నగేష్, టిఎస్ఎస్ లలితకుమారి, సబ్ యూనిట్ ఆఫీసర్ రమణయ్య, హెల్త్ సూపర్‌వైజర్ రమణ, చంద్రకళ, నాగరత్నమ్మ ఎల్‌టి కేశవ, ఎంఎల్‌హెచ్‌పిలు, రాధా, విజయ్, సుస్మిత, సత్యమ్మ, లక్ష్మి నారాయణమ్మ, ఎఎన్ఎంలు ప్రమీల, సుస్మిత, మంజువాణి, రాధమ్మ, నాగజ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.